ప్రజాశక్తి
శనివారం 8 నవంబరు 2025
5
శ్రీకాకుళం



పిఎం యశస్వి ఉపకార వేతనాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం


ప్రధానమంత్రి యశస్వి (ఎన్ఎస్‌పి) పథకం కింద ఉపకార వేతనాలకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ సాధికారత అధికారి ఇ.అనురాధ ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలోని గుర్తింపు పొందిన పాఠశాలలు, కళాశాలల్లో 9, 10, ఇంటర్మీడియట్ చదువుతున్న బిసి, ఇబిసి తరగతులకు చెందిన విద్యార్థులు ఈనెల 15వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం కలెక్టరేట్‌లోని జిల్లా బిసి సంక్షేమశాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు.

ఊరించి... ఉసూరుమనిపించి

- మార్పులు, చేర్పులపై మంత్రుల బృందం ఏర్పాటు
- ఒక్క రోజూ జిల్లాలో పర్యటించని వైనం
- మార్పులు, చేర్పులపై ఆశతో గ్రీవెన్స్‌లో వినతి
- ఒక్క ప్రతిపాదననూ పరిగణనలోకి తీసుకోని కేబినెట్ సబ్ కమిటీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాల పునర్విభజనలో గత వైసిపి ప్రభుత్వం లోపభూయిష్టంగా చేసిన విభజనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వాటిని సరిదిద్దుతామంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పిన మాటలకు, వాటి అమలుకు చాలా వ్యత్యాసం కనిపిస్తోంది. మంత్రుల బృందం జిల్లాలో పర్యటించి, వినతులు స్వీకరిస్తుందని చెప్పారు. జిల్లాకు హోం మంత్రి అనితతో పాటు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను నియమించింది. మంత్రుల బృందాన్ని నియమించినా, వారు ఒక్కరోజూ దీనిపై జిల్లాలో పర్యటించలేదు. అయినా పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు, సంఘాల నాయకులు పలు సందర్భాల్లో మీకోసంలో కలెక్టర్‌కు వినతులు ఇచ్చారు. ప్రభుత్వం వాటిని పరిగణనలోకి తీసుకుని తమ ఆకాంక్షలను నెరవేరుస్తుందని అంతా భావించారు. కేబినెట్ సబ్ కమిటీ పరిశీలనలో అందులో ఏ ఒక్కటీ లేకపోవడంతో తీవ్ర నిరాశకు లోనయ్యారు.



జిల్లాల పునర్విభజన తర్వాత పాతపట్నం నియోజకవర్గాన్ని టెక్కలి రెవెన్యూ డివిజన్‌లో కలపడంతో పనుల నిమిత్తం వెళ్లే ప్రజలు తీవ్ర వ్యయప్రయాసలకు లోనవుతున్నారు. కొత్తూరు నుంచి టెక్కలి వెళ్లాలంటే 67 కిలోమీటర్ల దూరం ప్రయాణించాలి. టెక్కలికి నేరుగా బస్సులు కూడా లేని పరిస్థితి. మూడు బస్సులు మారితే గానీ టెక్కలికి చేరుకోలేం. తమ మండలాన్ని శ్రీకాకుళం రెవెన్యూ డివిజన్‌లో కలపాలంటూ జిల్లాల పునర్విభజన నాటి నుంచి కోరుతూనే ఉన్నారు. ఎల్ఎన్‌పేట మండల ప్రజలదీ అదే పరిస్థితి. ప్రభుత్వం కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేయడంతో గ్రీవెన్స్‌లోనూ వినతులు ఇచ్చారు. ప్రభుత్వం తమ వినతిని పరిశీలిస్తుందని, కష్టాలు తీరతాయని వారు ఆశలు పెట్టుకున్నారు. తీరా చూస్తే ఈనెల ఐదో తేదీన సమావేశమైన కేబినెట్ సబ్ కమిటీ, కనీసం దాన్ని పరిగణనలోకి తీసుకోలేదు. జిల్లాల విభజన తర్వాత పలాస రెవెన్యూ డివిజన్‌లో ఉన్న నందిగాంను యథావిధిగా టెక్కలి రెవెన్యూ డివిజన్ పరిధిలోకి తీసుకొచ్చారు. వాస్తవానికి నందిగాం, పలాస మధ్య 18 కిలోమీటర్ల దూరం ఉండగా... నందిగాం, టెక్కలి మధ్య 10 కి.మీ దూరం ఉంది. ఈ ప్రతిపాదనలను పరిశీలించిన ప్రభుత్వం... కొత్తూరు, ఎల్ఎన్‌పేట మండలాల ప్రజల వినతిని పరిశీలించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇది ఏ రకమైన శాస్త్రీయ విభజన అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కేవలం వ్యవసాయమంత్రి అచ్చెన్నాయుడు నియోజకవర్గం వల్లే ప్రభుత్వం పరిశీలనలోకి తీసుకుందని, తమ కష్టాలను ప్రభుత్వం చూడలేదని ఆయా మండలాల ప్రజలు వాపోతున్నారు.

కొత్త జిల్లానూ లేదు... డివిజనూ లేదు

జిల్లాకు సంబంధించి కొత్తగా ఒక్క మార్పునకూ అవకాశం కల్పించలేదు. ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, పాతపట్నం నియోజకవర్గాలతో కొత్తగా పలాస జిల్లా ఏర్పాటు చేస్తారంటూ గతంలో జోరుగా ప్రచారం సాగింది. ఇటీవల కాలం వరకు కొత్త జిల్లా ఏర్పాటుకు అవకాశం ఉండవచ్చని అంతా అనుకున్నారు. కేబినెట్ సబ్ కమిటీ పరిశీలించిన ప్రతిపాదనల్లో అది లేకపోవడంతో తీవ్ర నిరాశకు లోనయ్యారు. ఇచ్ఛాపురం నుంచి జిల్లా కేంద్రానికి రావాలంటే సుమారు నాలుగు గంటల సమయం పడుతోంది. తీవ్ర వ్యయ ప్రయాసలకు లోనవుతున్న ప్రజలు పలాస జిల్లా ఏర్పాటైతే, తమ కష్టాలు తీరతాయని భావించారు. అదీ కూడా కొండెక్కిపోయింది. మెట్టూరు, మురపాక, బారువ ప్రాంతాలను మండల కేంద్రాలుగా మార్చాలని వినతులూ వస్తున్నాయి.

ఐటిడిఎ లేని జిల్లాగానే శ్రీకాకుళం

మార్పులు, చేర్పులు తర్వాత కూడా శ్రీకాకుళం జిల్లా ఐటిడిఎ లేని జిల్లాగానే మిగిలిపోయింది. ఐటిడిఎ ఏర్పాటు అంశం కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉండడంతో అది ఇప్పట్లో జరిగే పని కాదనే చర్చ ఉంది. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా సీతంపేట మండలాన్ని జిల్లాలో చేరుస్తారనే ప్రచారం జోరుగా సాగింది. మరోవైపు పాలకొండ నియోజకవర్గాన్ని శ్రీకాకుళం జిల్లాలో కలపాలంటూ ర్యాలీలు, వినతులతో ప్రభుత్వానికి మొరపెట్టుకున్నారు. అవేవీ ప్రభుత్వ పరిశీలనలో లేకుండా పోయాయి. మొత్తమ్మీద జిల్లాల పునర్విభజనతో ప్రజలకు వైసిపి ప్రభుత్వం ఏ కష్టాలను మిగిల్చిందో, టిడిపి కూటమి ప్రభుత్వం కూడా దాన్నే కొనసాగిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాల విభజన శాస్త్రీయంగా జరగలేదని కూటమి ప్రభుత్వం చెప్తూనే, అదే అశాస్త్రీయతను కొనసాగించడంతో ప్రజలు తీవ్ర అసంతృప్తికి లోనవుతున్నారు.



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తులసీదాస్

సోషలిజంతోనే సమస్యలకు పరిష్కారం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

అన్ని సమస్యలకు సోషలిజమే పరిష్కారమని, మహోత్తరమైన అక్టోబరు విప్లవం ప్రపంచ గమనాన్ని మార్చివేసిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్ అన్నారు. రష్యన్ విప్లవ దినోత్సవ సందర్భంగా 'సోషలిజం ఔన్నత్యం - సామ్రాజ్యవాదుల దోపిడీ' అనే అంశంపై ఎచ్చెర్ల మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. 1917 అక్టోబర్ 25వ తేదీన చరిత్ర గర్భాన్ని చీల్చుకొని ఒక మనిషిని మరో మనిషి, ఒక జాతిని మరో జాతి దోచుకునే, దోపిడీ లేని సోషలిస్టు వ్యవస్థ తొలిసారి ఆవిష్కృతమైందన్నారు. రష్యన్ కేలండర్ ప్రకారం అక్టోబర్ 25 నేటి ఆధునిక కేలండర్ ప్రకారం నవంబర్ 7వ తేదీన వస్తుందని తెలిపారు. అమెరికాలో న్యూయార్క్ మేయర్‌గా సోషలిస్టు గెలవడం ఒక గొప్ప పరిణామాన్ని సూచిస్తుందన్నారు. పేదరికం లేని రాష్ట్రంగా కేరళలోని సిపిఎం ప్రభుత్వం ఉందని, ఇది దేశానికే ఆదర్శమని కొనియాడారు. సోషలిస్టు వ్యవస్థలో విద్య, వైద్యం, ఉపాధి హక్కుగా ఉంటాయని, అందరికీ అన్ని అవకాశాలు ఉండే సమాజమన్నారు. రష్యాలో తొలిసారిగా కార్మికవర్గం రాజ్యాధికారంలోకి వచ్చిన తర్వాత ఎనిమిది గంటల పనిదినాన్ని చట్టం ద్వారా అమలు చేసిందని, అది ప్రపంచవ్యాప్తంగా అమల్లోకి వచ్చిందని గుర్తుచేశారు. నేడు బిజెపి, టిడిపి కూటమి ప్రభుత్వాలు కార్మికవర్గం సాధించుకున్న 8 గంటల పనిదినాన్ని 12 గంటలుగా మార్చి కార్మికవర్గాన్ని తీవ్రంగా దోపిడీ చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సామ్రాజ్యవాద దేశాలు తృతీయ ప్రపంచ దేశాలపై ఆంక్షలు పెట్టి దోపిడీ చేస్తున్నాయని చెప్పారు. మోడీ ప్రభుత్వం అమెరికన్ సామ్రాజ్యవాదానికి లొంగిపోయిందని విమర్శించారు. ఇది దేశ సార్వభౌమాధికారానికి ప్రమాదమన్నారు. కార్మికవర్గం తన తక్షణ సమస్యలపై పోరాటంతో పాటు సోషలిస్టు వ్యవస్థ కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు మాట్లాడుతూ కార్మికవర్గం తరతరాలుగా పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వర్గాన్ని తీవ్రంగా దోపిడీ చేస్తున్నాయని విమర్శించారు. దీనికి వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఎం మండల కన్వీనర్ ఎన్.వి రమణ అధ్యక్షతన నిర్వహించిన సభలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.తేజేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్.అమ్మన్నాయుడు, నాయకులు డి.బంగార్రాజు, టి.నందోడు, పలు సంఘాల నాయకులు ఎ.సత్యనారాయణ, ఎం.రమణ, పి.శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.



అధికారులను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

పనిచేయని అధికారులను నిలదీస్తా...

ఎమ్మెల్యే కూన రవికుమార్

ప్రజాశక్తి - పొందూరు

అధికారులు బాధ్యతతో పనిచేయాలని, పనిచేయని అధికారులను తాను నిలదీస్తూనే ఉంటానని పియుసి ఛైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. పొందూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి కిల్లి ఉషారాణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల సమావేశాలను అధికారులు చులకనగా చూడరాదని, మూడు నెలలకోసారి నిర్వహించే సమావేశాలకు తప్పనిసరిగా హాజరు కావాలని స్పష్టం చేశారు. సిఎస్‌డిటి మధుబాబు సమావేశానికి గైర్హాజరు కావడంపై ఆరా తీశారు. ఈ విషయం తెలిసి కొద్దిసమయానికి వచ్చిన ఆయనకు ఆ శాఖకు సంబంధించి పలు ప్రశ్నలు ఎమ్మెల్యే అడిగారు. వాటికి సమాధానం చెప్పకపోవడంపై మండిపడ్డారు. అధికారులు సమగ్ర సమాచారంతో సమావేశాలకు హాజరు కావడం బాధ్యత అని అన్నారు. రేషన్ స్మార్ట్‌కార్డులు పూర్తిస్థాయిలో పంపిణీ చేయకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. మండలంలో గతేడాది కన్నా ఎక్కువగా యూరియాను పంపిణీ చేశామని, భూమి లేని కొందరు యూరియాను తీసుకుని బ్లాక్‌లో అమ్ముకోవడంతో వాస్తవ రైతులకు అన్యాయం జరిగిందన్నారు. మనకు వచ్చిన యూరియాను సైతం కొందరు ఇతర నియోజకవర్గాలకు తరలించడం తన దృష్టికి వచ్చిందన్నారు. మొంథా తుపానుతో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లినా, వాటి నష్టాలను నమోదు చేయలేదని పలువురు సభ్యులు సమావేశంలో ప్రస్తావించారు. పంటల నమోదులో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు నష్టాల గురించి తన దృష్టికి తీసుకురాకుండా సొంతంగా నిర్ణయాలు తీసుకోవడమేమిటని అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. జల జీవన్ మిషన్ పనుల్లో భాగంగా పైపులు వేసేందుకు సిమెంట్ రోడ్లను తవ్వేసి అలా వదిలేయడంపై ఆ శాఖ అధికారులను పలువురు సభ్యులు ప్రశ్నించారు. ధర్మపురంలో తామే సిమెంట్‌తో రహదారిపై గోతులను పూడ్చుకున్నామని ఎంపిటిసి అన్నెపు కుమారి తెలిపారు. పొందూరు అఫీషియల్ కాలనీలో రహదారులపైనే మురుగునీరు నిలిచిపోతోందని ఎంపిటిసి బాడాన హారిక ప్రస్తావించారు. కాలనీలో కాలువలు లేకపోవడంతో సమస్య ఉందని, కొందరు ముందుకొచ్చి రహదారులపై నిర్మాణాలు చేశారని ఇఒ మోహన్‌బాబు తెలిపారు. పార్టీ నాయకులు కలుగజేసుకోకుండా ఉంటే ఆక్రమణలు తొలగిస్తామన్నారు. పొందూరులో మూడు నెలలకు ఒకసారి దుకాణాల లైసెన్స్‌లుకు డబ్బులు పెంచాల్సి ఉండగా, 2014 నుండి ఇప్పటివరకూ పెంచకపోవడంతో పంచాయితీకి రావాల్సిన ఆదాయం పోతోందని హారిక అన్నారు. పాత లైసెన్స్‌కు నాలుగురెట్లు పెంచాలని ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం పలు తీర్మానాలను సభ్యులు ఆమోదించారు. సమావేశంలో ఎంపిడిఒ ఎస్.వాసుదేవారావు, వైస్ ఎంపిపి శ్రీదేవి, డిప్యూటీ ఎంపిడిఒ సింహాచలం, పిఎసిఎస్ అధ్యక్షులు మురళి, మాజీ ఎంపిపి కూన ప్రమీల, పలువురు ఎంపిటిసిలు, సర్పంచ్‌లు మండలస్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

భావితరాలకు 'వందేమాతరం' తెలియాలి

శ్రీకాకుళం సిటీ : వందేమాతరం గేయాన్ని భావితరాలకు తెలియజేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. జాతీయ గేయం 'వందేమాతరం' 150 సంవత్సరాల సంస్మరణోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం సామూహిక గాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందేమాతరం గేయాన్ని 1875 నవంబర్ 7న బంకించంద్ర ఛటర్జీ రచించినట్లు చెప్పారు. ఈ గేయాన్ని ఆయన తొలిసారి రాసిన ఆనందమఠం నవలలో ప్రచురితం చేసినట్లు తెలిపారు. ఆయన బెంగాలీలో రాసిన ఈ గేయం స్వాతంత్ర్య ఉద్యమంలో చాలా ప్రాచుర్యం పొందిందన్నారు. 1950లో భారతదేశ జాతీయ గేయంగా ప్రకటించిబడిందని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డిఆర్ఒ లక్ష్మణమూర్తి, డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, బిసి సంక్షేమశాఖ అధికారి అనురాధ, కలెక్టరేట్ పరిపాలనాధికారి జి.ఎ సూర్యనారాయణ, ఆయా విభాగాల పర్యవేక్షులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

శ్రీకాకుళం లీగల్ : చట్టాలపై ప్రజలకు అవగాహన లేకపోవడం వల్లే చాలామందికి న్యాయం చేకూరడం లేదని ఒకటో అదనపు జిల్లా జడ్జి పి.భాస్కరరావు అన్నారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు స్థానిక న్యాయ సేవా సదన్‌లో జాతీయ న్యాయ సేవా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టాలపై అందరికీ అవగాహన అవసరమన్నారు. న్యాయ సమస్యలను పరిష్కరించుకోవడానికే జాతీయ న్యాయ సేవా దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా కోర్టుల్లో పెండింగ్ కేసుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతున్నాయన్నారు. ప్రధానంగా బడుగు, బలహీన వర్గాలు, మహిళలు, వికలాంగులు, షెడ్యూల్ తెగలు, కులాలు, పిల్లలకు న్యాయ సలహాలు అందించడంలో కీలకపాత్ర పోషిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మూడో అదనపు జిల్లా జడ్జి సిహెచ్.వివేక్ ఆనంద్ శ్రీనివాస్, స్పెషల్ జడ్జి పోక్సో ఎన్.సునీత, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి ఎం.శ్రీధర్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు టి.శివప్రసాద్, ప్యానల్ లాయర్లు, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి భాస్కరరావు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

'ఆఫ్‌షోర్' పనుల్లో వేగం పెంచాలి

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ఆఫ్‌షోర్ రిజర్వాయర్ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసి మెళియాపుట్టి, పలాస, వజ్రపుకొత్తూరు, నందిగాం తదితర మండలాల్లోని వేలాది ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రాజెక్టు పురోగతిపై శుక్రవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. భూసేకరణ ఇతర పనులకు సంబంధించిన పాత పెండింగ్ బిల్లులు సుమారు రూ.16.20 కోట్లు తక్షణమే విడుదల చేయడానికి ప్రతిపాదనలు పంపాలని వంశధార భూసేకరణ విభాగాన్ని కలెక్టర్ ఆదేశించారు. పునరావాసం, పునర్నిర్మాణం ప్యాకేజీలు అందించడానికి అదనంగా రూ.24.50 కోట్లు (భూసేకరణకు రూ. 12 కోట్లు, ఆర్ అండ్ ఆర్ లబ్ధిదారులకు రూ.12.50 కోట్లు) అవసరమని అధికారులు నివేదించగా, ఈ ప్రతిపాదనలను వెంటనే ప్రభుత్వానికి సమర్పించాలని ఆదేశించారు. పలాస - పర్లాకిమిడి డైవర్షన్ రోడ్డుకు సంబంధించిన భూసేకరణ దాదాపు పూర్తయిందని, అర్హులైన వారికి చెల్లింపులను వేగవంతం చేయాలన్నారు. ప్యాకేజీలు, డబుల్ స్టోర్డ్ భవనాలు, డబుల్ చెల్లింపులు వంటి సమస్యలపై ఆర్‌డిఒ, సంబంధిత తహసీల్దార్లు పూర్తిస్థాయి నివేదికలను త్వరగా సమర్పించాలని ఆదేశించారు. ప్రాజెక్టు పనుల్లో ఎలాంటి జాప్యం కావడానికి వీల్లేదన్నారు. రైతులకు సాగునీరు, పలాస - కాశీబుగ్గ పట్టణానికి తాగునీరు అందించాలనే లక్ష్యాన్ని అధికారులు సకాలంలో చేరుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి ఎస్.వెంకటేష్, జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మణ మూర్తి, ప్రత్యేక ఉప కలెక్టర్ జయదేవి, టెక్కలి ఆర్‌డిఒ కృష్ణమూర్తి, వంశధార ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

కేన్సర్‌పై విజయం... స్క్రీనింగ్‌తో సాధ్యం

జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి కె.అనిత

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

కేన్సర్‌పై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి కె.అనిత అన్నారు. కేన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా నగరంలోని ఏడు రోడ్ల కూడలి వరకు నిర్వహించిన ర్యాలీని జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయం వద్ద రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మన్ జగన్మోహనరావుతో కలిసి జెండా ఊపి శుక్రవారం ప్రారంభించారు. కేన్సర్‌పై విజయం - స్క్రీనింగ్‌తో సాధ్యం అంటూ ర్యాలీ పొడవునా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచంలో తొలి స్థానంలో గుండె జబ్బులు, రెండో స్థానంలో కేన్సర్ ఉందని తెలిపారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరికీ ఇంటి వద్దకే వైద్యారోగ్య శాఖ సిబ్బంది వచ్చి కేన్సర్ పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. కేన్సర్ బాధితుల్లో ప్రతి ముగ్గురిలో ఇద్దరికి వ్యాధి ముదిరిన తర్వాతే ఇది నిర్ధారణ అవుతోందని, అందువల్ల బతికే అవకాశాలు తగ్గిపోతున్నాయన్నారు. సరైన అవగాహన లేక కేన్సర్ బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. అవగాహన లేమి, నిరక్షరాస్యత, భయం, అపోహల వల్లే కేన్సర్ నిర్ధారణ ఆలస్యమవుతోందన్నారు. పొగాకు, మద్యపానం, ఊబకాయం, ఆహారపు అలవాట్లు, ఇన్ఫెక్షన్ల ద్వారా కేన్సర్ వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. ఇందులో భాగంగా ఓరల్, బ్రెస్ట్, సెర్వికల్ కేన్సర్లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్‌సిడి ప్రోగ్రాం అధికారి శివరంజని, డిఐఒ డాక్టర్ రామదాసు, మెడికల్ ఆఫీసర్లు, ఎన్‌సిడి, వైద్యారోగ్యశాఖ సిబ్బంది, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి అనిత

'మన మిత్ర'పై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

మన మిత్ర (వాట్సాప్ గవర్నెన్స్)పై ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. వాట్సాప్ గవర్నెన్స్‌పై ఇంటింటి అవగాహనా కార్యక్రమంలో భాగంగా అరసవల్లిలోని వెలమవీధి సచివాలయాన్ని శుక్రవారం సందర్శించారు. మన మిత్ర రిజిస్ట్రేషన్, ఆస్తి పన్ను, విద్యుత్ బిల్లులు, భూములకు సంబంధించి 1-బి వస్తుంది, లేనిదీ పరిశీలించారు. రైతు శిమ్మ అప్పారావును భూ వివరాలు అడగ్గా, ఒక ఖాతా నంబరులో ఉన్న భూమి రీ సర్వేలో మూడు ఖాతాల్లో ఉందని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు.



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్

సమస్యను పరిష్కరిస్తామని కలెక్టర్ తెలిపారు. మరో రైతు పట్టణ ప్రాంతాల్లో వ్యవసాయ భూముల రీ సర్వే అవ్వలేదని కలెక్టర్‌కు తెలియజేయగా, సంబంధిత అధికారితో కలెక్టర్ ఫోన్‌లో మాట్లాడారు. త్వరలోనే పట్టణ ప్రాంతాల్లో రీ సర్వే చేస్తారని రైతుకు వివరించారు. సర్టిఫికేట్లు, ఆస్తి పన్ను, విద్యుత్ బిల్లులు తదితరమైనవి ఇంటింటికీ వెళ్లి వారి ఫోన్ లోనే బిల్లుల చెల్లింపుపై అవగాహన కల్పించాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

రాష్ట్రస్థాయి అండర్-14 అథ్లెటిక్స్ పోటీలకు వజ్రపుకొత్తూరు మండలం పూండి- గోవిందపురం ముస్తాబైంది. ఎపి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన నేటి నుంచి రెండు రోజుల పాటు ఈ క్రీడలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ కన్వీనర్, స్థానిక పాఠశాల హెచ్ఎం కె.హరిబాబు తెలిపారు. అండర్-14 విభాగంలో బాలబాలికలకు నిర్వహించే పోటీలకు 13 ఉమ్మడి జిల్లాల నుంచి 600 మంది క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. రన్నింగ్ 100, 200, 400, 600 మీటర్లు, లాంగ్, హై జంప్, షాట్‌పుట్, డిస్కస్, 4 ఇంటూ 100 రిలే, 80 మీటర్స్ హార్డిల్స్ పోటీలు ఉంటాయన్నారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారు జాతీయ స్థాయిలో ఆడేందుకు అర్హత సాధిస్తారని తెలిపారు.



సిద్ధం చేసిన ట్రాక్స్

బాలియాత్ర బందోబస్తు ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి - జలుమూరు

శ్రీముఖలింగేశ్వర ఆలయం సమీపంలో ఈనెల తొమ్మిదో తేదీన నిర్వహించనున్న బాలియాత్ర మహోత్సవం సందర్భంగా యాత్రికులకు ఎటువంటి ఇబ్బంది, అసౌకర్యం కలగకుండా అన్ని విభాగాలు సమన్వయంతో బందోబస్తు ఏర్పాట్లు చేయాలని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి ఆదేశించారు. పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్, అగ్నిమాపక, ఇరిగేషన్, ఆలయ అధికారులు, స్థానిక నిర్వాహకులతో కలిసి తీర్థ ఘాట్ ప్రాంతాలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలియాత్రకు పెద్దసంఖ్యలో యాత్రికులు హాజరయ్యే అవకాశమున్న దృష్ట్యా పటిష్ట పోలీసు బందోబస్తుతో పాటు సిసి కెమెరాల ఏర్పాటు, బారికేడ్లు, క్యూలైన్ల నిర్వహణ సక్రమంగా ఉండాలని సూచించారు.

రోప్ పార్టీలు, మూవింగ్ పార్టీలు విధుల్లో ఉండాలన్నారు. యాత్రికులు వచ్చి, వెళ్లే మార్గాలు వేర్వేరుగా ఉండాలని సూచించారు. నదిలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో సంబంధిత అధికారుల సమన్వయంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. తాత్కాలిక లైటింగ్, రహదారి మార్గాలు, పార్కింగ్ ఇతర సౌకర్యాలపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. కార్యక్రమంలో టెక్కలి డిఎస్‌పి డి.లక్ష్మణరావు, నరసన్నపేట సిఐ శ్రీనివాసరావు, ఎస్ఐ అశోక్‌బాబు, రెవెన్యూ, ఇతర విభాగాల అధికారులు, నిర్వాహకులు, ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.




ఘాట్లను పరిశీలిస్తున్న ఎస్పి మహేశ్వర్ రెడ్డి



నివగాంలో భవనానికి సంబంధించిన పత్రాలు పరిశీలిస్తున్న ఆర్‌డిఒ

ఆర్‌డిఒ విస్తృత పర్యటన

కొత్తూరు: మండలంలో పలు ఫిర్యాదులపై టెక్కలి ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. మండలంలో మెట్టూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థల వివాదం, మెట్టూరు బిట్-1లో దేవాలయం అనుమతి లేకుండా నిర్మాణం చేయడంపై, మెట్టూరు జంక్షన్‌లో ప్రభుత్వ స్థలం ఆక్రమణ, మాతలలో స్థల ఆక్రమణ, కౌసల్యపురం రీ సర్వే, నివగాంలో ప్రభుత్వ స్థలంలో నూలు వీరభద్ర స్వామి తప్పుడు పత్రాలు సృష్టించి అక్రమంగా భవన నిర్మాణం చేపట్టారని, గూనభద్ర భూ ఆక్రమణలను ఆర్‌డిఒ పరిశీలించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఈయనతో ఆర్‌ఎస్ డిటి రామచంద్రరావు, సర్వేయర్ గవరయ్య, అర్.ఐ.ఎం కృష్ణారావు, విఆర్‌ఒ బాలకృష్ణ తదితరులున్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

చెకుముకి పరీక్షలో విద్యార్థుల ప్రతిభ

మెళియాపుట్టి: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఉన్నత పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన చెకుముకి పరీక్షలో కరజాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మండల స్థాయిలో తృతీయ స్థానంలో నిలిచారు. శుక్రవారం పాఠశాలలో పల్లి పవన్ కుమార్ (9వ తరగతి), పొందర వరుణ్ (10వ తరగతి), పి.కుమారస్వామి (8వ తరగతి) విద్యార్థులకు, గైడ్ టీచర్ ఆదినారాయణను హెచ్‌ఎం టివి రమణమూర్తి, ఉపాధ్యాయులు కె.శ్రీరాములు, టి.గోపాలకృష్ణ, రామారావు, సిహెచ్ ఆదినారాయణ, ఎస్ దాస్, ఎల్వీ చలం, పి.ప్రమీల, పుష్ప కుమారి, జగదీష్, సింహాచలం, పుష్పలత, కిరణ్ తదితరులు అభినందనలు తెలిపారు.

ప్రజా సంక్షేమాన్ని విస్మరించారు

టెక్కలి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించిందని వైసిపి టెక్కలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేరాడ తిలక్ అన్నారు. రచ్చబండ కార్యక్రమాన్ని శుక్రవారం మండలంలోని పెద్దశాన, పరశురాంపురం గ్రామాల్లో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రయివేటీకరణ చేయడం తగదన్నారు. వైసిపి ప్రభుత్వం అందించిన పథకాలనే పేర్లు మార్చుకుని పబ్బం గడుపుకుంటున్నారని అన్నారు. విజనరీ ఉన్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో టెక్కలి జడ్‌పిటిసి దువ్వాడ వాణి, ఎంపిపి ఆట్ల సరోజనమ్మ, సర్పంచ్‌లు గుజ్జు మోహన్‌రెడ్డి, కోరాడ కామేష్, పొట్నూరు భూలక్ష్మి, పొందర శ్రీనివాస్, మెర్రి శంకరరావు, పొట్నూరు అప్పలనాయుడు, పొట్నూరు రామ్మూర్తి నాయుడు, ఆట్ల రాహుల్‌కుమార్, వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

వందేమాతరం విశిష్ట గేయం



శ్రీకాకుళం రూరల్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

ప్రజాశక్తి- పోలాకి

వందేమాతరం గేయానికి 150 ఏళ్లైన ఈ చారిత్రాత్మక సందర్భం దేశ ప్రజలందరికీ గర్వకారణమని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పేర్కొన్నారు. మబగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ బంకించంద్ర ఛటోపాధ్యాయ రాసిన వందేమాతరం స్వాతంత్ర్య సమరయోధులకు ప్రేరణనిచ్చిన ఓ అగ్ని గీతమని, ఈ జాతీయ గీతం దేశ భక్తిని, ఏకత్వాన్ని, త్యాగ స్ఫూర్తిని ప్రతిబింబిస్తుందన్నారు. భారతమాతకు వందనం చేసే ఈ గేయం దేశ నిర్మాణంలో ప్రతి భారతీయుడికి కొత్త స్ఫూర్తి నింపాలని ఆకాంక్షిస్తూ ప్రజలందరికీ ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, నరసన్నపేట వంశధార డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ శిమ్మ చంద్రశేఖర్, యాళ్ల వేణుగోపాలరావు, ధర్మాన అమ్మ నాయుడు, తహశీల్దార్, ఎంపిడిఒ, ఎంఇఒ, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కోడూరు ఇన్‌ఛార్జి హెచ్‌ఎం లక్ష్మణరావు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు మూల వేణుగోపాలరావు, వెంకటరమణ, బాడాన రాజు, మోహిని, వెంకటరమణ, నారాయణరావు, శ్రీహరిరావు, శాంతి, హేమలత, రాజేశ్వరరావు, రఫీ, కళావతి, వసంతరావు, రాంబాబు, స్థానిక సేవా సంస్థ ప్రతినిధులు చింతాడ భారతి, పైల కావ్య, లావ గణేష్, ధర్మేంద్ర తదితరులు పాల్గొన్నారు.

లావేరు: మండల కేంద్రంలో వందేమాతరం గేయం 150 ఏళ్లపూర్తిచేసుకున్న సందర్భంగా హైస్కూల్‌లో బాలబాలికలచే వందే మాతరం గీతాన్ని ఆలపించారు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు బంకించంద్ర ఛటర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్: మండలంలోని సింగుపురం పంచాయతీలో వందేమాతరం గేయం 150 ఏళ్ల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే శంకర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జి.ఆదిత్యనాయుడు, ఎంపిడిఒ ప్రకాశరావు, ఇఒపిఆర్‌డి కవిత, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో వందేమాతరం 150 సంవత్సరాలు వేడుకలు నిర్వహించారు. ఈ సభకు స్కూల్ చైర్మన్ డి. కృష్ణమూర్తి రెడ్డి అధ్యక్షత వహించారు. వందేమాతరం గేయ రచయిత చటర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో మేనేజర్ కె.సి.పూరి, ఉపాధ్యాయులు శంకర్, శ్రీధర్, రవి, కృష్ణ, శాంతి, రాజ్యలక్ష్మి, జయలక్ష్మి, మీనా, స్నేహ, రోజా, సరోజిని తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం సిటీ: వందేమాతరం గేయానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని జిల్లా ఎస్‌పి కెవి మహేశ్వర రెడ్డి ఆదేశాలతో జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా వందేమాతరం గీతా ఆలాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కె.వి.రమణ, పోలీసు అధికారులు, సిబ్బంది, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వందేమాతరం దేశభక్తి గేయాన్ని ఏకస్వరంతో ఆలపిం చారు. కార్యక్రమంలో ఎఒ గోపినాథ్, సిఐ శ్రీనివాస్, ఆర్‌ఐ శంకర్ ప్రసాద్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఆమదాలవలస : 'వందేమాతరం' గీతానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎన్‌సిసి విభాగం చీఫ్ ఆఫీసర్ మోహనరావు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఎన్‌సిసి సెకండ్ ఆఫీసర్ శరత్ కుమారి, ఆర్మీ హవల్దార్ బహుదూర్ నేతృత్వంలో విద్యార్థులు ప్రధాన రహదారిలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి హెచ్‌ఎం రవికుమార్, ఉపాధ్యాయులు గొంటి గిరిధర్, మోహనరావు, రామస్వామి, షేక్ షావలి, శివరాజు, అరుణ పాల్గొన్నారు.

శ్రీకాకుళం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.పోలినాయుడు ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో క్రీడాకారులు, ఎన్‌సిసి విద్యార్థులు, స్టార్‌వాకర్స్ క్లబ్ ప్రతినిధులు సారధ్యంలో వందేమాతరం గీతం 150 ఏళ్లు నిండిన సందర్భంగా స్వచ్ఛ భారత్ నిర్వహించారు. ఆర్ట్స్ కళాశాల ఆవరణను పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో స్టార్‌వాకర్స్ క్లబ్ ప్రతినిధులు గేదెల ఇందిరా ప్రసాద్, శాసపు జోగినాయుడు, నాగేశ్వర ఈశ్వరరావు, గేదెల లక్ష్మీ, కృష్ణారావు, తిరుపతి, ఎన్‌సిసి విద్యార్థులు పాల్గొన్నారు.

కవిటి: వందేమాతరం గేయానికి నేటితో 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులతో వందేమాతర గేయాన్ని ఆలపించి దాని యొక్క గొప్పతనాన్ని, విశిష్టతను వివరించారు.

అరసవల్లి: నగరంలోని గాంధీ మందిరంలో వందేమాతర గేయరచయిత బంకించంద్ర ఛటర్జీకి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో పైడి హరనాథరావు, మెట్ట అనంతంభట్లు, కొంక్యాన వేణుగోపాల్, పొన్నాడ రవికుమార్, మహిబుల్లాఖాన్, జి.నాగేశ్వరరావు, బుడుమూరు సూర్యారావు, బుడుమూరు విజయకుమారి, శాస్త్రి, చింతాడ రామచంద్రరావు పాల్గొన్నారు.

అలాగే నగరంలోని పిఎన్ కాలనీలో జాయ్ కిడ్స్ ఇంటర్నేషనల్ ప్లే స్కూల్ కరస్పాండెంట్ జామి స్రవంతి కిరణ్ ఆధ్వర్యంలో వందేమాతరం గేయం 150వ వార్షికోత్సవ వేడుకలను నిర్వహించారు. విద్యార్థులు జాతీయ జెండాలతో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కంచిలి: వందేమాతరం గేయం రచించి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా అన్ని పాఠశాలల్లో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని మకరాంపురం ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు 150 సంఖ్య అకృతిలో చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, సిబ్బంది, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



పోలాకి : మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి



పలాస : ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పలాస: స్థానిక ఇందిరా గాంధీ జంక్షన్‌లో పలాస జీడి ఉత్పత్తి దారుల సంఘం ఆధ్వర్యంలో వందేమాతరం 150 ఏళ్ళను పురస్కరించుకుని కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా జాతీయ జెండాలతో జీడి పరిశ్రమల యజమానులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జీడి పరిశ్రమల సంఘం కార్యదర్శి టంకాల రవిశంకర్ గుప్త, కోశాధికారి మల్లా సంతోష్ కుమార్, కామేశ్వరరావు, కోట్ని శశిభూషణరావు, పట్నాల శ్రీనివాసరావు, తర్లాన మురళి తదితరులు పాల్గొన్నారు. అలాగే కాశీబుగ్గ ఎస్‌బిఎస్‌వైఎం డిగ్రీ కళాశాల విద్యార్థులు జంట పట్టణాల్లో ర్యాలీ నిర్వహించారు.

వజ్రపుకొత్తూరు: మండలంలోని కంబాలరాయుడుపేట ప్రాథమిక పాఠశాల ఆవరణలో 'వందేమాతరం' 150 ఏళ్ల ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకుని విద్యార్థులచే 150 ఆకారంలో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లఖినాన కరుణాకర్, ఉపాధ్యాయులు పి.కృష్ణారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యాసంస్థలకు పని దినం

టెక్కలి: ప్రభుత్వ విద్యా సంస్థలకు రెండవ శనివారం పనిదినాన్ని జిల్లా కలెక్టర్ రద్దు చేశారు. రెండవ శనివారం పాఠశాలలకు సెలవుదినం అయినప్పటికీ ఇటీవల కాలంలో కురిసిన వర్షాలు, తుపాను కారణంగా పాఠశాలలకు సెలవులు కేటాయించడంతో రెండవ శనివారం పని దినంగా పాటించాలని కలెక్టర్ ఆదేశాల మేరకు నేడు పాఠశాలలు పనిచేస్తున్నాయి. తుపాను కారణంగా మూడు రోజులపాటు సెలవులను కలుపుకుని గతంలో రెండు రోజులు వర్షాల కారణంగా పాఠశాలలకు సెలవులు ఇవ్వడంతో మార్చి 2026 వరకు ఉన్న రెండవ శనివారాలు పాఠశాలలు పని చేయాలని ఆదేశాల మేరకు నేడు ప్రభుత్వ పాఠశాలలు పనిచేయనున్నాయి.

అరసవల్లి సందర్శన

అరసవల్లి: అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామిని విశాఖపట్నం నార్త్ జోన్ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు దంపతులు దర్శించుకున్నారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ, ఆలయ ఇఒ కె.ఎన్.వి.డి.వి ప్రసాద్, ఆలయ సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వదించారు.

రైతు బాంధవుడు ఆచార్య ఎన్.జి.రంగా

ప్రజాశక్తి- పలాస

ఆచార్య ఎన్‌జి రంగా రైతు బాంధవుడని, ఆయన సిద్ధాంతాలు నేటి తరానికి అనుసరణీయమని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ, ఎమ్మెల్యే గౌతు శిరీష పేర్కొన్నారు. విజయవాడలోని సర్వోత్తమ గ్రంథాలయంలో ఎన్‌జి రంగా 125వ జయంత్యుత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కురాడి చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వహించిన సభలో మాజీమంత్రి శివాజీ, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషలు పాల్గొని మాట్లాడారు. రాష్ట్రానికి ఆయన ఎనలేని సేవలందించారని, పార్లమెంట్ భీష్మునిగా ఖ్యాతిగాంచారని మననం చేసుకున్నారు. ఎన్‌జి రంగా ప్రియశిష్యుడు సర్దార్ గౌతు లచ్చన్న అని, శ్రీకాకుళం జిల్లాతో ఆయనకున్న అనుబంధాన్ని నెమరు వేసుకున్నారు. కార్యక్రమంలో ఎపి మాజీ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధ ప్రసాద్, మాజీ లోక్‌సభ సభ్యులు, రైతు నాయకులు వడ్డే శోభనాద్రీశ్వరరావు, ఎంపీ డాక్టర్ ఎలమంచిలి శివాజీ, గ్రంథాలయ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ రావి శారద, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి- అరసవల్లి

రైతుల సమస్యలపై దేశంలో గళమెత్తి రైతు బాంధవునిగా ఆచార్య ఎన్.జి.రంగా నిలిచిపోయారని వివిధ రంగాల ప్రముఖులు పేర్కొన్నారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, పార్లమెంట్ సభ్యునిగా 60 సంవత్సరాలు సేవలందించి గిన్నీస్ రికార్డు సాధించిన ఆచార్య ఎన్.జి.రంగా 125వ జయంతి వేడుకలు శుక్రవారం గాంధీ మందిరంలో నిర్వహించారు. మాజీ మంత్రి త్రిపురాన వెంకటరత్నం సమర్పించిన ఆచార్య ఎన్.జి.రంగా విగ్రహానికి ఎన్‌వైకె డిప్యూటీ డైరెక్టర్ ఉజ్వల్, గాంధీ మందిర ప్రతినిధులు పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా సురంగి మోహన్‌రావు, వావిలపల్లి జగన్నాథంనాయుడు మాట్లాడుతూ రైతుల కోసం జీవన పర్యాంతం పోరాడిన యోధులు ఆచార్యులు ఎన్.జి.రంగా అని అన్నారు. కార్యక్రమంలో ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొంక్యాన వేణగోపాల్, గాంధీ మందిర కమిటీ ప్రతినిధులు పైడి హరనాథరావు, మెట్ట అనంతంభట్లు, హారికాప్రసాద్, పొన్నాడ రవికుమార్, మహిబుల్లాఖాన్, జి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పలాస : నివాళ్లర్పిస్తున్న శివాజీ, శిరీష తదితరులు

వివాహిత అదృశ్యం

ప్రజాశక్తి- లావేరు

మండల కేంద్రం లావేరు పంచాయతీ కేశవరాయపురం గ్రామానికి చెందిన వివాహిత బోనెల ఆశ అనే వివాహిత అదృశ్యమైనట్టు భర్త బోనెల రమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సి జోగారావు తెలిపారు. ఆశ గతనెల 31న ఉదయం 10 గంటల సమయంలో లావేరులో బట్టలు కుట్టించుకుంటానని చిన్న కుమారుడు చాణిక్యను రేషన్ కార్డులో యాడింగ్ చేస్తానని చెప్పి ఇంటినుంచి చాణిక్యను తీసుకుని వెళ్లి ఇప్పటికీ రాకపోవడంతో ఇన్నిరోజులు వెతికినా ఎక్కడా ఆచూకీ లేకపోవడంతో శుక్రవారం లావేరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఎస్‌ఐ జి.లక్ష్మణరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



అదృశ్యమైన ఆశ



వసతిగృహాన్ని పరిశీలిస్తున్న ఎంపిడిఒ తిరుమలరావు

వసతిగృహం పరిశీలన

కంచిలి: మండల కేంద్రంలోని బిసి బాలుర సంక్షేమ వసతిగృహాన్ని స్థానిక ఎంపిడిఒ వి. తిరుమలరావు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతిగృహంలోని మరుగుదొడ్లతో పాటు పరిసరాలను పరిశీలించారు. ఆహార పదార్థాల నిల్వలతో పాటు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మెరుగైన నిర్వహణ కోసం పలు సూచనలను అందజేశారు. విద్యార్థుల కోసం తయారు చేస్తున్న ఆహార పదార్థాలను పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ వీరభద్రరావు, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం చైతన్య, కార్యదర్శి రాంబాబు, స్థానికపెద్దలు జగదీష్ పట్నాయక్, ఎంఎం పట్నాయక్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

కోటబొమ్మాళి: చట్టాలపై అవగాహన కలిగివుండాలని కోటబొమ్మాళి ఫుల్ అడిషనల్ ఛార్జి సివిల్ జడ్జి ఎం.రోషిణి అన్నారు. గురువారం కోర్టులో ఈ నెల 9న జాతీయ న్యాయసేవా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు 'ప్రాథమిక హక్కులు, ప్రాథమిక విధులు, భారత రాజ్యాంగ ఆదేశిక సూత్రాలు'పై వ్యాసరచన పోటీలను నిర్వహించి బహుమతులను అందించారు. విద్యార్థుల్లో పోటీతత్వం వుండాలన్నారు. ఈ సదస్సులో న్యాయవాదుల సంఘం అధ్యక్షులు ఎల్. శ్రీనివాసులు, ఇతర న్యాయవాదులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పొందూరు: విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి బి.జోత్స్న అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండల న్యాయ సేవా సంఘం ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఈనెల 9న లీగల్ సర్వీస్ డే సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. అనంతరం పలు చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. న్యాయ వాదులు కె.అశోక్, రాము, ఉపాధ్యాయులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

టెక్కలి: స్థానిక గిరిజన సంక్షేమ కళాశాల బాలుర వసతిగృహంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి బి.నిర్మల మాట్లాడుతూ న్యాయం దృష్టిలో అందరూ సమానమేనన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో టెక్కలి బార్ అసోసియేషన్ అధ్యక్షులు పినకాన అజయ్‌కుమార్, ఎ.జి.పి.దివ్వల వివేకానంద, అద్దాల రాజేష్, సంక్షేమాధికారి ఎస్. సుదర్శనరావు, పట్టణ ఎస్.ఐ. కె.రాము తదితరులు పాల్గొన్నారు.



కోటబొమ్మాళి : విదార్థులకు పోటీలు నిర్వహిస్తున్న జడ్జి రోషిణి



పొందూరు : విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న జడ్జి జోత్స్న

రాజేశ్వరరావు ఆశయ సాధనకు కృషి

ప్రజాశక్తి- సోంపేట

గంటి రాజేశ్వరరావు ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని సిపిఎం మండల కార్యదర్శి సంగారు లక్ష్మీనారాయణ, సిపిఎం నాయకులు దుంపల కృష్ణారావు పిలుపునిచ్చారు. బారువలో శుక్రవారం గంటి రాజేశ్వరరావు వర్ధంతి, అక్టోబర్ విప్లవ వార్షికోత్సవ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు, పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ తొలితరం నాయకులు రాజేశ్వరరావు నిర్బంధాలు సైతం ఎదుర్కొని అనేక ఉద్యమాలు నిర్మించిన గొప్ప యోధుడని కొనియాడారు. కార్మిక, రైతాంగ ఉద్యమాలు నిర్మాణం చేశారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేయడమే రాజేశ్వరరావుకు మనం ఇచ్చిన ఘనమైన నివ్వాలన్నారు. ఈ సందర్భంగా కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక విప్లవగీతాల ప్రదర్శన ఆహుతులను విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో సిపిఎం నాయకులు జుత్తు సింహాచలం, దున్న యామయ్య, చిరంజీవి, సమేన జానకి రామయ్య, కె.రాజు, వి.తారకేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం నాయకులు కృష్ణారావు



ఎంపికైన విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక

ఇచ్ఛాపురం: ఇటీవల నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో బాలికోన్నత పాఠశాలకు చెందిన కె.విజయలక్ష్మి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ నెల 8 నుంచి 10 వరకు విజయనగరం జిల్లాలో రాష్ట్రస్థాయి పోటీలు జరుగుతున్నాయని హెచ్‌ఎం బల్ల శ్రీనివాసరావు తెలిపారు. అదే విధంగా జి.చందన, యమునశ్రీ, అథ్లెటిక్స్‌లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని అన్నారు. స్టేట్ లెవెల్ అథ్లెటిక్స్ టోర్నమెంట్ జిల్లాలో వజ్రపుకొత్తూరు మండలం గోవిందపురం జెడ్ పి హైస్కూల్‌లో 8 నుంచి 10 వరకు జరుగునుంది. రాష్ట్రస్థాయి పోటీలకు కాదా లక్ష్మీకాంతమ్మ, బాలికోన్నత పాఠశాల విద్యార్థులు ఎంపిక కావడం, స్టేట్ లెవెల్‌లో మంచి ప్రతిభను కనబరిచి నేషనల్ లెవెల్‌కి వెళ్లాలని ఆకాంక్షించారు. పాఠశాల ఎస్ఎంఎస్ చైర్మన్ వెంకటరావు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉదయ భాస్కరరావుకు పిహెచ్‌డి

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని ధర్మపురం గ్రామానికి చెందిన మొదలవలస ఉదయ భాస్కరరావు ప్రఖ్యాత వారణాసి ఐఐటి (భారతీయ విశ్వ విద్యాలయం) నుంచి ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగంలో పిహెచ్‌డి పట్టాను పొందారు. వారణాసిలో జరిగిన 14వ కాన్వొకేషన్‌లో ఈ పట్టాను అందుకున్నారు. ఈయన సౌరశక్తి ఆధారిత హైడ్రోజన్ ఉత్పత్తి, నిల్వ సాంకేతికతల సిస్టం లెవెల్ ఇంటిగ్రేషన్, హైబ్రిడ్ ఎనర్జీ సిస్టంపై పరిశోధనలు చేశారు. ప్రస్తుతం ఉదయ భాస్కరరావు జంషెడ్ పూర్‌లోని నేషనల్ మెటలర్జికల్ లాబొరేటరీలో ప్రిన్సిపల్ సైంటిస్ట్‌గా, ఇంజనీరింగ్ డివిజన్‌కు హెచ్ఒడిగా పనిచేస్తున్నారు. ఆయనకు పిహెచ్‌డి పట్టా రావడంతో గ్రామస్తులు అభినందనలు తెలిపారు.



పిహెచ్‌డి పట్టా అందుకుంటున్న ఉదయ భాస్కరరావు

కేన్సర్‌పై అవగాహన అవసరం



మెళియాపుట్టి : ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్ పావని తదితరులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

కేన్సర్‌పై అవగాహన అవసరమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. కలెక్టరేట్ కార్యాలయం వద్ద కేన్సర్‌పై శుక్రవారం నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో మాట్లాడారు. ప్రజలు కేన్సర్ వ్యాధి పరీక్షలు చేయించుకోవాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరికీ ఇంటి వద్దకే వైద్యారోగ్య శాఖ సిబ్బంది వచ్చి కేన్సర్ పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌సిడి ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ శివరంజని, మోహిని, మురళి పాల్గొన్నారు.

సంతబొమ్మాళి: సంతబొమ్మాళి మండలం నౌపడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ కేన్సర్ అవగాహన దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. వైద్యాధికారి డా.పరిమిళ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె కేన్సర్ లక్షణాలు, నిర్ధారణ విధానం, చికిత్సా మార్గాలు, అలాగే ముందస్తు జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆరోగ్య సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: మండలంలోని చాపర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో కేన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైద్యాధికారి డాక్టర్ పావని నేతృత్వం వహించారు. ర్యాలీ సూపర్‌వైజర్ పి.మురళి, ఎఎన్‌ఎం లోకేశ్వరి, ఆశ వర్కర్స్ లక్ష్మీ, ప్రభావతి, హెల్త్ అసిస్టెంట్ బాబురావు తదితరులు పాల్గొన్నారు.

అరసవల్లి: ముందుగా గుర్తిస్తే కేన్సర్‌ను జయించవచ్చని లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షులు డా.పైడి.సింధూర అన్నారు. జాతీయ కేన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా, స్థానిక కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో కేన్సర్ అవగాహన కార్యక్రమాన్ని, కళాశాల డైరెక్టర్ బరాటం శ్రీనివాస చక్రవర్తి, ప్రిన్సిపాల్ కె.శివ శంకర్ సహకారంతో నిర్వహించారు. కార్యక్రమంలో రవితేజ డెవలెపర్స్ అధినేత పి.సింహాచలం, జిఎన్ జ్యుయలర్స్ ఎండి కిరణ్ కుమార్, సంధ్య దంపతులు కేన్సర్‌పై అవగాహన కల్పిస్తూ ప్రసంగించారు.



సంతబొమ్మాళి : అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న పిహెచ్‌సి సిబ్బంది

ఐతమ్ విద్యార్థులకు శిక్షణ

టెక్కలి రూరల్: టెక్కలి ఐతమ్ ఇంజినీరింగ్ కళాశాలలోని ఎ.పి. నైపుణ్యాభివృద్ధి కేంద్రం ఆధ్వర్యంలో 'ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డ్ డిజైన్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ ఎంబెడెడ్ సిస్టమ్స్'పై ఆరు రోజుల పాటు నిర్వహించిన ప్రత్యక్ష శిక్షణ కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరరావు తెలిపారు. ఈ శిక్షణలో డిప్లొమా ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన చివరి సంవత్సరానికి చెందిన 62 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఈ వర్క్‌షాప్‌లో విద్యార్థులు లైవ్‌వైర్ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి వివిధ సర్క్యూట్‌ల రూపకల్పన, ఎల్ఇడి ద్వారా సందేశ ప్రదర్శన, అంధుల కోసం సెన్సార్ ఆధారిత గుడ్డికర్ర ప్రాజెక్ట్, గది ఉష్ణోగ్రతను గుర్తించి ఫ్యాన్ నియంత్రణ వ్యవస్థ వంటి అనేక వినూత్న ప్రాజెక్టులను రూపొందించారు. ఈ శిక్షణకు ఎపి స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ శిక్షకుడు బి.మహీదర్ మార్గదర్శకత్వం వహించారన్నారు.

విజేతలుగా తిరిగి రావాలి



క్రీడాకారులతో సూర శ్రీనివాసరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

నవంబరులో గుంటూరు సత్తెనపల్లిలో నిర్వహించే రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు పాల్గొని విజేతలుగా తిరిగి రావాలని సాఫ్ట్‌బాల్ రాష్ట్ర కార్యదర్శి, ఎస్ఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ సూర శ్రీనివాసరావు ఆకాంక్షించారు. క్రీడాకారులకు క్రీడా సామగ్రిని, దుస్తులను శుక్రవారం అందజేశారు. పట్టుదలతో కృషి చేసి పతకాలు సాధించి జిల్లా ఖ్యాతిని చాటాలన్నారు. స్పోర్ట్స్ కోటలో ఉద్యోగాలకు అవకాశాలు అధికంగా ఉన్నాయన్నారు. సాఫ్ట్‌బాల్ క్రీడకు ఆదరణ అధికంగా ఉందని క్రీడాకారులు ఈ ఆటపై మక్కువ పెంచుకోవాలని సూచించారు. క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసానికి తోడ్పడతాయన్నారు. క్రీడలకు ప్రభుత్వాలు పెద్దపీట వేస్తున్నాయన్నారు. అవకాశాలను అందిపుచ్చుకుని భవిష్యత్‌లో ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. జిల్లాలో కాసింఖాన్, కరణం మల్లేశ్వరి, నీలంశెట్టి లక్ష్మి వంటి ఎందరో క్రీడాకారులు దేశస్థాయిలో తమ ప్రతిభను కనబరిచి జిల్లాకు మంచి పేరు తీసుకొచ్చారని తెలిపారు. నేటితరం క్రీడాకారులు కూడా రాణించి జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో శిక్షకులు, పీడీలు తదితరులు పాల్గొన్నారు.



ఆమదాలవలస : చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

సిఎం సహాయనిధి పేదలకు వరం

ప్రజాశక్తి- ఆమదాలవలస

పేద కుటుంబాలకు సిఎం సహాయనిధి ద్వారా అందించే ఆర్థిక సహాయం లబ్ధిదారులకు వరంగా మారుతుందని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. శుక్రవారం తన స్వగృహం వద్ద సిఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన నగదు చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఎల్లువాడ పుష్పకు రూ.1.25 లక్షలు, గుండుపల్లి లక్ష్మీ భవాని రూ.3.90 లక్షలు, బొడ్డేపల్లి పట్టాభి కుటుంబానికి మంజూరైన రూ.65 వేలు చెక్కులను ఆయన సంబంధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ ప్రజల కష్ట సుఖాల్లో వైద్య అవసరాల్లో కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తూ వారికి చేదోడు వాదోడుగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో లబ్ధిదారులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పొందూరు: మండలంలోని కింతలి, రాపాక పంచాయతీ పరిధిలోని ఇల్లయ్య గారి పేట గ్రామాల్లో సిఎం సహాయ నిధులు చెక్కులను ఎమ్మెల్యే కూన రవికుమార్ సతీమణి, మాజీ ఎంపిపి కూన ప్రమీల బాధిత కుటుంబాలకు పంపిణీ చేశారు. కింతలి గ్రామానికి చెందిన పొన్నాడ పెంటయ్యకు రూ.1,13,767, అలాగే ఇల్లయ్యగారి పేట గ్రామానికి చెందిన కొంచాడ వెంకటరమణ రూ.41 వేలు చెక్కులను ఆమె అందజేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు చిగులపల్లి రామ్మోహన్, కూటమి నాయకులు అన్నెపు రాము, సీపాన శ్రీ రంగనాయకులు, బలగ శంకర్ భాస్కరరావు, కండాపు శ్రీనివాసరావు, బాడాన శేషగిరి, కొంచాడ కోటి తదితరులు పాల్గొన్నారు.



హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

ఇసుక అక్రమ రవాణాపై హెచ్చరిక బోర్డు

ఇచ్ఛాపురం: బాహుదా నది బ్రిడ్జి వద్ద ఇసుక అక్రమ రవాణాను అరికట్టడానికి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం జరిగిందని తహశీల్దార్ ఎన్.వెంకటరావు తెలిపారు. ప్రభుత్వ విప్ డాక్టరు బెందాలం అశోక్ ఆదేశాలతో ఇసుక అక్రమరవాణా, తవ్వకాలపై రెవెన్యూ అధికారులు కొరడా ఝులిపిస్తున్నారు. అందులో భాగంగానే బాహుదా బ్రిడ్జి నుంచి 500 మీటర్లలోపు బ్రిడ్జికి ఇరువైపుల హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఇకపై ఆక్రమణలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని తహశీల్దార్ హెచ్చరించారు.


విరాళాలు అందజేస్తున్న గ్రామస్తులు

పాఠశాలకు విరాళాలు అందజేత

ఇచ్ఛాపురం: మండలంలోని టి.బరంపురం గ్రామంలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు 12 ఏళ్లుగా రంగులు వేయకపోవడంతో పాఠశాలకు రంగులు వేయటానికి ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ధనలక్ష్మి సమక్షంలో నిర్వహించిన పేరెంట్స్ సమావేశంలో పలువురు విరాళాలు అందించారు. శుక్రవారం స్థానిక సర్పంచ్ కారంగి త్రినాథ్ రెడ్డితో పాటు పేరెంట్స్, గ్రామపెద్దలు విరాళాలు సేకరించి హెచ్ఎం కోళ్ల ధనలక్ష్మికి దాతల ద్వారా స్వీకరించిన మొత్తాన్ని అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ ఎస్ఎంసి చైర్మన్ దూపన రాజ్యలక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ మచ్చ మమతా, గ్రామపెద్దలు తిప్పన ధనంజయ రెడ్డి, దూపన నారాయణ, కొయ్య రామ్మూర్తి, దక్కతా మోహనరావు, ఎదురు కేదారి తదితరులు పాల్గొన్నారు.


విజయను అభినందించిన కిరణ్ కుమార్

మాజీ ఎమ్మెల్యేను కలిసిన ఎంపిపి

రణస్థలం: ఎచ్చెర్ల మండల పరిషత్ అధ్యక్షురాలుగా నియమితులైన జరుగుళ్ల విజయ రణస్థలం వైసిపి క్యాంపు కార్యాలయంలో ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్‌ని శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కిరణ్ కుమార్ శుభాకాంక్షలు తెలియజేస్తూ ఎచ్చెర్ల మండలం అభివృద్ధికి కృషి చేయాలన్నారు. మండల రైతు విభాగం అధ్యక్షులు సూరపు మురళి, నాయకులు శంకర్రావు, జమ్మల పోతయ్య, సూరపు భాస్కర్ పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్డుకు శంకుస్థాపన

శ్రీకాకుళం రూరల్: మండలంలోని, సింగుపురం పంచాయతీలోని మామిడివలస, బగ్గువానిపేటలో నూతన సిమెంట్ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే గొండు శంకర్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు రూ.12 లక్షల వ్యయంతో చేపట్టనున్న ఈ 300 మీటర్ల సిమెంట్ రోడ్డు నిర్మాణంతో స్థానికులకు మెరుగైన రవాణా సౌకర్యం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. గ్రామంలో ఇతర అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ప్రకాశరావు, టిడిపి నాయకులు రమేష్, ఆదినారాయణ, సిహెచ్ హిమగిరి, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

లక్ష్మణరావు మృతి తీరని లోటు

సోంపేట: జిల్లా కోర్టు న్యాయవాది చౌదరి లక్ష్మణరావు మృతి ప్రజా ఉద్యమాలకు తీరనిలోటని పలాసపురానికి చెందిన బీన ఢిల్లీరావు అన్నారు. అనారోగ్యంతో మృతి చెందిన లక్ష్మణరావు మృతికి సంతాపంగా శుక్రవారం సంతాప సభ నిర్వహించి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోంపేట, పరిసర ప్రాంతాల సమస్యలపై లక్ష్మణరావు న్యాయపోరాటం సాగిస్తున్న తరుణంలో ఇలా ఆకస్మికంగా మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. జన్నెల ప్రసాదరావు, గేదెల దేవరాయలు, పొందర అరుణ్ కుమార్, పల్లి హరిశ్చంద్ర, మంగి జయకృష్ణ, మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ

టెక్కలి: వారధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల్లో మండలంలోని సీతాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు సకలాభత్తుల భరత్, సుంకర ఉదయశ్రీ, కోరాడ శ్రీజ రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల్లో పాల్గొని ద్వితియ బహుమతి గెలుచుకున్నారని పాఠశాల హెచ్ఎం తమ్మినేని పద్మావతి ఒక ప్రకటనలో తెలిపారు. ద్వితీయస్థానం సాధించిన విద్యార్థులకు రూ.30 వేలు నగదు బహుమతి అందుకున్నారన్నారు. విద్యార్థులకు గైడ్ టీచర్‌గా వ్యవహరించిన చిన్నారావును, విద్యార్థులను అభినందించారు.

తక్షణమే సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

పాతపట్నం, మెళియాపుట్టి, హిరమండలం, కొత్తూరు, ఎల్ఎన్ పేట మండలాలకు చెందిన ప్రజా సమస్యలపై పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ఐదు మండలాల నుంచి వచ్చిన ఫిర్యాదుల్లో భూ వివాదాలు, రెవెన్యూ సమస్యలు, రహదారుల సమస్యలు, విద్యుత్, తాగునీరు తదితర సమస్యలపై ఎమ్మెల్యేకు ప్రజలు వినతులు అందించారు. వీటితో పాటు రేషన్ కార్డులు, పింఛన్లు. ఇళ్ల స్థలాలు, గృహనిర్మాణాలు చేపట్టాలని వినతులు సమర్పించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా, డిప్యూటీ తహశీల్దార్ కె.రాము, మండల వ్యవసాయ అధికారి ఎస్.దానకర్ణుడు, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ ఉదయ్ కుమార్, ఎంఇఒ ఎం. పద్మనాభ రావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


మెళియాపుట్టి : వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

ఆమదాలవలస: ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్ అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో కోర్లకోట ఎంపిటిసి అన్నెపు భాస్కరరావు, ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకులు పి.వి.వి.కె. రాజు, చౌదాల గోవిందరావు ప్రజలు పాల్గొన్నారు

ఇంటింటికీ పైపులైన్ ద్వారా తాగునీరు

ప్రజాశక్తి- పలాస

రెవెన్యూ గ్రామాల్లో శతశాతం పైపులైన్ నిర్మాణం చేపట్టిన గ్రామాల్లో పైపులైన్ ద్వారా ఇంటింటికి తాగునీరు సరఫరా చేయడం జరుగుతుందని ఎంపిడిఒ కె.వసంతకుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ సూర్యనారాయణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం హర్ ఘర్ జల్‌పై కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లుతో సమావేశం నిర్వహించారు. మండలంలో కైజోల, ఈదురాపల్లి రెవెన్యూ గ్రామాల్లో శతశాతం పైపులైన్ నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. గంగువాడ, గోపాలపురం, గురుదాసుపురం, లొద్దభద్ర, మరదరాజపురం, వీర రామచంద్ర పురం, సుమ్మాదేవి, రామకృష్ణాపురం గ్రామాల్లో శతశాతం పైపులైన్ పనులు చేపట్టేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. శతశాతం పూర్తయిన గ్రామాల్లో విలేజ్ వాటర్ శానిటేషన్ కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. కమిటీలో 15 మంది సభ్యులు ఉండాలని, అందులో సర్పంచ్ చైర్మన్, కార్యదర్శి కన్వీనర్, మిగిలిన సభ్యులు సచివాలయం ఉద్యోగులు, గ్రామ పెద్దలను నియమించాలన్నారు. తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు వస్తే తక్షణమే పనులు చేపట్టి తాగునీరు అందించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ ఎంపిడిఒ మెట్ట వైకుంఠ రావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సూర్యనారాయణ


పలాస : చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న అధ్యాపకులు

ఘనంగా సి.వి రామన్, క్యూరీ జయంతి

ప్రజాశక్తి- ఆమదాలవలస

భారతదేశ ప్రతిష్ఠను ఇనుమడింపజేసిన గొప్ప శాస్త్రవేత్త సర్ సివి రామన్, ఫిజిక్స్, కెమిస్ట్రీ విభాగాల్లో రెండు నోబెల్ బహుమతులు పొందిన మేరీ క్యూరీ జయంతి వేడుకలను పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఇన్‌ఛార్జి హెచ్ఎం పైల రవికుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మన దేశ గర్వకారణమైన సర్ సివి రామన్ జయంతిని జరుపుకోవడం ప్రతి భారతీయుడికి గౌరవంగా భావించాలన్నారు. ఆయన కనుగొన్న 'రామన్ ఎఫెక్ట్' కారణంగానే ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినంగా ప్రకటించారని అన్నారు. అదే రోజున 1988లో ప్రజా విజ్ఞాన ఉద్యమ సంస్థ 'జన విజ్ఞానవేదిక' ఆవిర్భవించిందని తెలిపారు. కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ పి.రామస్వామి నాయుడు, ఉపాధ్యాయులు జి.అప్పారావు, పి.మోహనరావు, ఎం.వి.ఆర్. భట్లు, కోట ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పలాస: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతిక శాస్త్రవేత్త, నోబెల్ బహుమతి గ్రహీత సర్ సి.వి.రామన్ జయంతి వేడుకలను నిర్వహించారు. కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పట్నాయక్ ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. విద్యార్థులు ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి నరసింహులు, ఫిజిక్స్ లెక్చరర్ హేమాచలం, రాజేష్, హరిప్రసాద్, ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి- లావేరు

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వం ధ్యేయమని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రం లావేరు, అప్పాపురంలోని చేనేత వృత్తి కార్మికులకు ఇటీవల సంభవించిన తుపాను సందర్భంగా చేతివృత్తుల వారికి ప్రభుత్వం అందజేస్తున్న ఉచిత నిత్యావసర సరుకులు పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ఒక్కొక్కరికి 50 కిలోలు బియ్యం, బంగాళా దుంపలు, పామాయిల్, కందిపప్పు, ఉల్లిపాయలు తదితర ఏడు రకాల సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేద, మధ్య తరగతి వృత్తిదారులు తుపాను సమయంలో వృత్తిలేక కుటుంబాలకు జీవనోపాధి లేక ఇబ్బందులు పడకూడదనే సిఎం చంద్రబాబు ఇటువంటి కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. లావేరు మండలంలో 3 గ్రామాల్లో ఏడు రేషన్ షాపుల్లోని 247 మంది చేనేత కార్మికులకు ఈ కార్యక్రమం ద్వారా లబ్ధి చేకూర్చడం జరిగిందన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ముప్పిడి సురేష్, తహశీల్దార్ గురుగుబిల్లి ఈశ్వర శ్రీనువాసరావు, ఎంపిడిఒ పి.వెంకటరాజు, ఎచ్చెర్ల ఎఎంసి చైర్మన్ నిడిగంట్ల పద్మ, లావేరు ఎస్ఎంసి చైర్మన్ లంకలపల్లి రాంబాబు, నాయకులు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.


చేనేత కార్మికులకు సరుకులు అందజేస్తున్న ఎమ్మెల్యే

బాలియాత్ర జయప్రదం చేయాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

వంశధార నది శ్రీముఖలింగం ప్రాంతంలో నిర్వహించే బాలియాత్రను అందరూ విజయవంతం చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి సనపల అన్నాజీరావు అన్నారు. శుక్రవారం కొర్లకోటలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బాలియాత్ర కళింగులది మాత్రమే కాదని కళింగ రాజ్య ప్రజల అందరిదన్నారు. ఈనెల 9న నిర్వహించే బాలియాత్రలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి

పొందూరు: మండలంలోని లోలుగు కెజిబివి విద్యార్థిని వందన రెండు నెలల క్రితం ఆత్మహత్య ప్రయత్నం చేసుకోవడానికి కారణమైన ప్రిన్సిపాల్ లలితకుమారి, టీచర్లపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని దళిత ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సాకేటి నాగరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విషయంపై కలెక్టర్ దృష్టి సారించి తగుచర్యలు తీసుకోవాలని కోరారు. సంబంధిత సంఘటనపై జిల్లా స్థాయిలో దళిత, ఆదివాస సంఘాలతో చర్చించి తగు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తామన్నారు.

టెట్ మినహాయించాలి

వజ్రపుకొత్తూరు: ఇన్ సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చందనరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అసోసియేషన్ సభ్యత్వ నమోదు కార్యకరమంలో భాగంగా శుక్రవారం మండలంలోని అనంతగిరి, హుకుంపేట, కాశీనటర్ ఎల్డీపేట, మంచినీళ్లపేట, వజ్రపుకొత్తూరు పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి ఉపాధ్యాయుడు టెట్ ఖచ్చితంగా పాస్ కావాలనే సుప్రీంకోర్టు తీర్పు ఉపాధ్యాయులను గందరగోళానికి గురి చేసిందని, వెంటనే దానిపై ప్రభుత్వం మినహాయింపు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు మజ్జి చినబాబు, జిల్లా సహాధ్యక్షులు ఎన్.విష్ణుమూర్తి, జిల్లా కార్యదర్శి మెట్ట గోపాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

పొందూరు: మండలంలోని లోలుగు, తాడివలస విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని ఎఇ సుదీర్ తెలిపారు. విద్యుత్ లైన్లు మరమ్మతుల నేపద్యంలో లోలుగు ఇండస్ట్రియల్ ఫీడర్, నందివాడ ఫీడర్‌లో గల బురిడి కంచారం, నందివాడ, నరసాపురం, భగవానుదాసుపేట, కేశవదాసుపురం గోరింట ఫీడర్‌లోని గోరింట, లైదాం, తుంగపేట, లొద్దలపేట, యాగాటిపేట, లుట్టపేట గ్రామాల్లో సరఫరా నిలిచిపోతుందని పేర్కొన్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

ఘనంగా అమరవీరుల వారోత్సవాలు

ప్రజాశక్తి- పలాస

మండలం బొడ్డపాడులో శుక్రవారం అమరవీరుల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. బొడ్డపాడు అమరవీరుల స్మారక భవనంలో ఎఐకెఎంఎస్ జిల్లా నాయకులు గొరకల బాలకృష్ణ అధ్యక్షతన అమరుల సంతాప సభ జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి వంకల మాధవరావు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్ మాట్లాడుతూ నక్సల్ బరి శ్రీకాకుళ ఉద్యమాల వెలుగులో గోదావరి లోయ ప్రతిఘటనా పోరాటాలతో వేలాది ఎకరాల భూములను ఆదివాసులు, దళితులు, పేదలు పోరాడి సాధించుకున్నారని గుర్తు చేశారు. శ్రీకాకుళ ఉద్యమంలో ఆణిముత్యాలు లాంటి అగ్ర నాయకులను పంచాది కృష్ణమూర్తి, తామడ గణపతి, సుబ్బారావు పాణిగ్రాహి, వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసం, డాక్టర్ భాస్కరరావు, దేవుని మల్లికార్జున్, పైలా వాసుదేవరావు, కుమార్ అన్నవాటి వారిని కాల్చి చంపారని గుర్తు చేశారు. విప్లవోద్యమాన్ని అణిచివేయడానికి కగార్ పేరుతో కూంబింగ్ నిర్వహించి మోదీ, అమిత్ షా నాయకత్వాన బడా కార్పొరేట్ సంస్థలకు అడవులను ఖనిజ సంపదను, ప్రకృతి వనరులను, మానవ వనరులను కట్టబెట్టడానికి మావోయిస్టు ముక్త్ భారత్ పేరుతో దారుణంగా ఆదివాసీలను చంపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టియు జిల్లా కన్వీనర్ వీరస్వామి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వినోద్, పిఒడబ్ల్యు అధ్యక్షులు బదకల ఈశ్వరమ్మ, కార్యదర్శి సలానాపురం కృష్ణవేణి, పివైఎల్ కన్వీనర్ జగన్, వంకల పాపయ్య, గాయకుడు కుత్తుం వినోద్ తదితరులు పాల్గొన్నారు.


నినాదాలు చేస్తున్న నాయకులు

ఆపదలో ఆదుకోవడం అందరి కర్తవ్యం


నిత్యావసర వస్తువులు అందజేస్తున్న ప్రతినిధులు

ప్రజాశక్తి- అరసవల్లి

ఆపదలో ఆదుకోవటం అందరి కర్తవ్యమని, విశాఖపట్టణానికి చెందిన సిహెచ్ దుర్గ వెంకట సుబ్బరాజు, అనూష దంపతులు అన్నారు. స్థానిక ఇండియన్ రెడ్‌క్రాస్ ప్రాంగణంలో పేద మహిళా కుటుంబాలకు నిత్యావసర సరుకులను జిల్లా వైద్యశాఖాధికారి అనిత, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు చేతులమీదుగా శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కంపోస్టు కాలనీకి చెందిన గేదెల లక్ష్మి, నారాయణమ్మలు ఒంటరిగా, నిస్సహాయ స్థితిలో జీవిస్తున్నారని, రెడ్‌క్రాస్ ప్రతినిధి నంది ఉమాశంకర్ అందించిన సమాచారం మేరకు విశాఖ పట్టణానికి చెందిన, సిహెచ్ దుర్గ వెంకట సుబ్బరాజు కుటుంబం, వీరికి అండగా నిలవటం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో బాధిత కుటుంబీకులు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మెరుగైన ఫలితాలు

ప్రజాశక్తి- కవిటి

గొర్లెపాడు యూనిట్ ఖాజురు గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎంటి నరసింహ, డిఎంఎంటి తులసయ్య మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించడం ద్వారా మెరుగైన ఫలితాలు వస్తాయని తెలిపారు. ప్రస్తుతం అపరాలు, నువ్వులు, అలసంధలు, మొక్కజొన్న, గోరుచిక్కుడు, అనుములు, గోంగూర పంటలను కలిపి ఆర్.డి.ఎస్ విధానంలో సాగు చేస్తున్నామని వివరించారు. రైతులు ఒకే పంటకే పరిమితం కాకుండా బహుళ పంటలు వేయడం ద్వారా అధిక లాభాలు సాధ్యమవుతాయని సూచించారు. అనంతరం రైతులకు ఆర్.డి.ఎస్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐసిఆర్‌పి స్వాతి, సంతోషి, రైతులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

బదిలీ ఉద్యోగికి సన్మానం

నందిగాం : మండల పరిషత్ కార్యాలయంలో డిప్యూటీ ఎంపిడిఒగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై విజయనగరం జిల్లా వంగర ఎంపిడిఒగా బదిలీపై వెళ్లిన తులా రాజారావుకు మండల పరిషత్ కార్యాలయంలో కార్యాలయ సిబ్బంది, కార్యదర్శుల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఎంపిడిఒ సేవలను కొనియాడారు. అనంతరం ఇటీవల బదిలీపై వెళ్లిన 22 మంది కార్యదర్శులకు సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ సంఘం అధ్యక్షులు రమణబాబు, మాజీ అధ్యక్షులు కె.సంతోష్ కుమార్ తదితరులున్నారు.

సుడిదోమ నివారణపై దృష్టి సారించాలి

కంచిలి: పంటకు తీరని నష్టం కలిగించే సుడిదోమ నివారణపై రైతులు దృష్టి సారించాలని మండల వ్యవసాయాధికారి సురేష్ సూచించారు. మండలంలోని బూరగాం, బొగాబెని, పుడాబద్ర గ్రామాల్లో శుక్రవారం వరిపంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్నిచోట్ల సుడిదోమ ఆశించినట్లు గుర్తించామన్నారు. దీనివల్ల వరి దుబ్బు అడుగు భాగంలో రసం పీల్చడం వల్ల, పైన పసుపు రంగులోకి మారి పంట నష్టం జరుగుతుందన్నారు. నివారించడానికి సూచించిన మందులను ఉపయోగించాలన్నారు. అధిక మోతాదులో రసాయన ఎరువులు ఉపయోగించడం వలన సైతం పంటకు నష్టం కలుగుతుందన్నారు. కాలిబాటలు ఏర్పాటు చేసుకుంటే చీడ, పీడలు నుంచి నివారణ పొందవచ్చు అన్నారు. సిబ్బందితో పాటు స్థానిక రైతులు పాల్గొన్నారు.

గ్రామాల్లో రహదారులు అధ్వానం

పలాస: మొంథా తుపాను కారణంగా మున్సిపాలిటీ పరిధిలో ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు అధ్వానంగా ఉన్నాయని ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని మొగిలిపాడు, అడవికొత్తూరు, కోసంగిపురం తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఆయన కూటమి నాయకులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా ప్రాంతాల్లో రోడ్లు అధ్వానంగా ఉన్నాయన్నారు. వరదనీటిలో రోడ్లు కొట్టుకుపోయాయని, తక్షణమే రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. రోడ్లు అధ్వానంగా ఉండడంతో గర్భిణీలు, వృద్ధులు, ప్రజలకు రాకపోకలు చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. పరిశీలించిన సమస్యలను ఎమ్మెల్యే గౌతు శిరీష దృష్టికి తీసుకు వెళ్లడం జరుగుతుందన్నారు.

మొక్కలపై అధ్యయనం చేయాలి

టెక్కలి: ప్రస్తుత సమాజంలో మొక్కలపై అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ అన్నారు. కళాశాల వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో స్థానిక నర్సరీ సందర్శన శుక్రవారం చేపట్టారు. వృక్షశాస్త్ర అధ్యాపకులు డి.వాసుబాబు, కోఆర్డినేటర్ వి.లూక్‌పాల్, ఎస్. పరమేశ్వరరావు, రాంబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.